
ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025



ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు పరిహారం విడుదల

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసితులకు కొంతమేర ఉపశనం లభించింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రావలిసిన భూపరిహారం కొంతమంది రైతులకు విడుదల చేశారు. గురువారం ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బాధిత రైతులతో పాటు జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఆర్డీవో దాట్ల కీర్తిని కలిసి సమస్యలపై చర్చించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ శుక్రవారం గూడెపువలస గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు రూ 7 కోట్ల 9 లక్షల రూపాయల పెండింగ్ బకాయిలు విడుదల చేయించారని బంగార్రాజు తెలిపారు. నష్టపరిహారం పొందిన రైతులు బంగార్రాజును పోలిపల్లి స్వగృహం వద్ద కలిసి దుస్సాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కవులవాడ ఎంపిటిసి కోరాడ తాతారావు, టిడిపి నాయకుడు కొండబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.



సమావేశమైన కాంట్రాక్టర్లు

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బకాయి బిల్లులు కోసం కాంట్రాక్టర్లు పోరుబాట పడుతున్నారు. నగర పాలక సంస్థలో చేపడుతున్న అభివృద్ధి పనులకు బిల్లుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్తితి నెలకొన్న పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నగర పాలక సంస్థ లో సుమారుగా 30 మందికి పైగా ఉన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు చేపడుతున్నారు. అయితే గత రెండేళ్ల నుంచి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో వారంతాఉద్యమ బాట పడుతున్నారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్ల పోరుబాట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సుమారు రూ.15 కోట్లు వరకు పాత, కొత్త పనులు బిల్లుల డబ్బులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నగరపాలక సంస్థ నిధుల నుంచి చేపట్టిన అభివృద్ధి పనులే ఎక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో బకాయిలు అలాగే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధి పోర్టల్ లో అప్‌లోడ్ చేసిన వాటికి మాత్రమే బిల్లులు ఇస్తామని చెప్పడంతో రెండు దఫాలుగా అకౌంట్స్ విభాగం సిబ్బందిని రాజధానికి తీసుకెళ్లి నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించారు. అయితే మార్చి 31 ముందున్న బిల్లులు వెనక్కి పంపించింది. తర్వాత నిధి పోర్టల్ పెట్టింది, కమిషనర్ లాగిన్ నుంచి పే అండ్ అకౌంట్ అధికారికి బదిలీ చేశారు. నిధిపోర్టల్‌పై అవగాహన చేసుకోవడానికి కొంత సమయం పట్టింది. దీంతో విజయవాడ రెండు పర్యాయాలు తీసుకొని వెళ్లి పరిష్కరించుకున్నారు. పాత బిల్లులు ముందు క్లియర్ చేసిన తర్వాత కొత్త బిల్లులు పెట్టాలన్న నిర్ణయం మేరకు రూ.5లక్షలు లోపు బిల్లులు సుమారుగా రెండు కోట్లు వరకు బిల్లులు అయ్యాయి. ఇంకా సుమారు రూ.15 కోట్లు వరకు రావాల్సి ఉంది. అభివృద్ధి పనులు కు టెండర్లు పిలిచిన అధికారులు పనులు పూర్తి అయిన తర్వాత బిల్లులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్లు అంటున్నారు. మరోవైపు కార్పొరేషన్‌లో మురుగుపోయిన నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో టెండర్లు పిలిచిన పనులు ఆగిపోయాయి. మరో వైపు పదవీ కాలం పూర్తి అవుతుండటం, స్థానిక సంస్థలు ఎన్నికలు రానుండటంతో వార్డుకు రూ.20 లక్షలు పనులు చేయాలని టెండర్లు పిలిచి పనులు బలవంతంగా చేయించిన అధికారులు బిల్లులు చెల్లించకుండా ఒడ్డు దాటితే బోడి మల్లన్న అన్న చందంగా వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వడంపై మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలు గడువు లోపు మూడు కంపెనీలు 6 శాతం వడ్డీ తో చెల్లించే విధంగా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందాన్ని కూడా అమలు చేయకుండా మన నగర పాలక సంస్థ లో వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని అడిగితే అధికారులు తమను అవమానపరిచారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. మరోవైపు కాంట్రాక్టర్లకు నగర పాలక సంస్థ నోటీసులు ఇవ్వడంతో శనివారం వారంతా సమావేశమై నగరపాలక అధికారులకు సోమవారం నోటీసు ఇచ్చి బుధవారం ధర్నాకు దిగాలని నిర్ణయించారు. ప్రధానంగా బకాయి బిల్లులు చెల్లించాలని, ఆడిట్ విభాగంలో ప్రక్షాళన చేయాలని, పని చేసిన వెంటనే రికార్డు చేసి, ఎన్ని దినాలలో బిల్లులు చెల్లిస్తారో చెప్పాలని, కాంట్రాక్టర్లకు గౌరవ ప్రదంగా చూడాలని, ఆన్‌లైన్ బిల్లుల్లో జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం

అత్యున్నత విద్యాబోధనే లక్ష్యం

మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్రంలోని విద్యార్థులందరికీ అత్యున్నత విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో రూ.7.45 కోట్లతో నిర్మించనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ భవన సముదాయానికి మంత్రి శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ రూ.65.25 లక్షలతో నిర్మించిన నాలుగు తరగతి గదులను, రూ.61.10 లక్షలతో నిర్మించిన ప్రహరీగోడను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఈ భవనాలను పూర్తి చేస్తామని చెప్పారు. ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయుల కంటే మిన్నగా ప్రభుత్వ ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్రశిక్ష ఎపిసి ఎ.రామారావు, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణారావు పాల్గొన్నారు.

కొట్టక్కి భూములు ఎపిఐఐసివే

ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని కొట్టక్కిలో ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించిన భూములు ఎపిఐఐసికి చెందినవేనని ఆర్‌డిఒ జెవిఎస్ రామ్మోహన్ స్పష్టం చేశారు. కొట్టక్కి పంచాయతీలో ఎంఎస్ఎంఇ పార్కులో చేపడుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పనులను అడ్డుకోవడానికి వచ్చిన కాకర్లవలస గ్రామస్తులను వారించారు. ఈ భూమిని 2018లోనే ఎపిఐఐసికి కేటాయించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. 187.08 ఎకరాల భూమికి ఎపిఐఐసి ప్రభుత్వానికి రూ.7 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. గ్రామస్తులకు వేరే చోట ఆర్ఒఆర్ పట్టాలు ఇచ్చామని, వాటిని సాగు చేసుకోవాలని సూచించారు. పర్యటనలో తహశీల్దార్ ఎం.శ్రీను, ఎపిఐఐసి డిజెడ్ఎం జయచంద్ర, జెఇ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-వేపాడ

ఎపి రైతుసంఘం నాయకులపై అక్రమంగా పెట్టిన కేసును కొత్తవలస కోర్టు కొట్టేసింది. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని 2018 జనవరిలో ఎపి రైతుసంఘం నాయకులు చల్లా జగన్, చలుమూరి శ్యామ్ ఆధ్వర్యాన మండలంలోని బొద్దాం జంక్షన్‌లో విశాఖ-అరకు రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని సుమారు 200 మంది రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో అప్పటి తహశీల్దార్ వెంకటరమణ వెంటనే స్పందించి, జిల్లా అధికారులతో మాట్లాడి ఆరోజే బొద్దాంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పటి వల్లంపూడి ఎస్ఐ గొంప రాజేష్ ఆందోళన చేస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కేసును విచారించి, సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. రైతుసంఘం నాయకుల తరపున బానాది గ్రామానికి చెందిన న్యాయవాది గొంప వెంకటరమణ వాదించారు.

29న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఈనెల 29న జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేసారు.

ఉప్పొంగిన వసంత గెడ్డ

ప్రజాశక్తి-గంట్యాడ



తాడు సాయంతో గెడ్డ దాటుతున్న ప్రజలు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వసంత, చంద్రంపేట గ్రామాల మధ్యనున్న గెడ్డ శుక్రవారం రహదారిపై ఉప్పొంగి ప్రవ హిస్తోంది. దీంతో అధికారులు గెడ్డకు ఇరువైపులా రాకపోకలను నిలుపుదల చేశారు. గతంలో ఇద్దరు వ్యక్తులు గెడ్డలో గల్లంతై మరణించడంతో తహశీల్దార్ నీలకంఠేశ్వర్, ఎంపిడిఒ రమణమూర్తి, ఎస్ఐ సాయికృష్ణ స్పందించి, రాకపోకలను నిలిపి వేయించారు.

పారాది వద్ద స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులు

బొబ్బిలి : మండలంలోని పారాది వద్ద ట్రాఫిక్ స్తంభించింది. వేగావతి నది నీటి ప్రవాహం పెరగడంతో కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పైనుంచి బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు. నాగులచవితి కోసం సొంత గ్రామాలకు వచ్చే వారి సంఖ్య పెరగడంతో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో వంతెనకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడం వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

శివారు భూములకు సాగునీరు అందాలి

మడ్డువలస రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-వంగర

మడ్డువలస రిజర్వాయర్ శివారు భూములకు సైతం సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వంగర మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మడ్డువలస రిజర్వాయర్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు కింద సాగులో ఉన్న భూమి నీటి ప్రవాహ స్థితిని ఆరా తీశారు. మ్యాపులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి కాలువలో పూడిక తొలగించడానికి, ఇరువైపులా గట్లను బలోపేతం చేయడానికి, అవసరమైన చోట లైనింగ్ నిర్వహించేందుకు ప్రతిపాదన తయారు చేయాలని సూచించారు. నీటి పన్ను వసూలు చేసి, ఆ డబ్బులతో లష్కర్లకు జీతాలు చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మడ్డువలస ప్రాజెక్టు ఇఇ బి.గోవిందరావు, డిఇ పి.అర్జున్, ఎఇ నితిన్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.మారావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ఉపాధి వేతనదారులకు సగటు వేతనం పెంచాలి : కలెక్టర్

కంటోన్మెంట్ : జిల్లాలో ఉపాధి హామీ వేతన దారులకు సగటు వేతనం పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి డ్వామా అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులపై ఎపిడిలు, ఎంపిడిఒలతో సమీక్షించారు. రహదారులు, పంట కాలువల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం 3 నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీలో లక్ష్యాలకు దిగువన ఉన్న మండలాల ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. రెండు వారాల్లో పూర్తి సమీక్ష నిర్వహిస్తానని, సమగ్ర సమాచారం తో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, సిపిఒ బాలాజీ, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కర్నూలు సమీపాన కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కె . సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒరిస్సా రాష్ట్రంలో కేవలం 43 సీటింగ్ కాంట్రాక్ట్ క్యారియర్ పర్మిషన్ తీసుకొని స్లీపర్ కోచ్ గా మార్చి అక్రమాలకు పాల్పడిన కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రమాదంలో చనిపోయిన 19 మంది ప్రయాణికుల కుటుంబాలకు వారు సంతాపం, సానుభూతిని తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనా చట్టంలో సవరణలు చేసి ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్‌టిసిని ముంచేశారని తెలిపారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు 50 లక్షలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.వేలల్లో కరెంటు బిల్లులు

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-వేపాడ



విద్యుత్తు బల్లులు చూపిస్తున్న మారిక గిరిజనులు

మండలంలో మారిక గిరిజనులకు రూ.వేలల్లో కరెంటు బిల్లులు రావడంతో బెంబేలెత్తి పోతున్నారు. తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్తు ఎఇ నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందు తున్నారు. ఒక్కో గిరిజన కుటుంబానికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు బిల్లులు వచ్చాయి. గత ప్రభుత్వ కాలంలో తాము బిల్లులు చెల్లించలేదని, టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.వేలల్లో కరెంటు బిల్లులు ఇస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు చెల్లించకుంటే పెనాల్టీ పడుతుందని, తరువాత ఇబ్బంది పడతారని ఆ శాఖ సిబ్బంది బెదిరింపులకు దిగడంతో కొంతమంది గిరిజనులు ఇప్పటికే చెల్లించారు. ఇంకా 70 కుటుంబాలకు పైగా విద్యుత్తు బిల్లులు చెల్లించలేమంటూ శుక్రవారం మారిక గ్రామంలో ఆందోళన చేశారు. నిరసనలో వీర్రాజు, కనకరావు, బాబూరావు, గిరిజన మహిళలు పాల్గొన్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణను సంప్రదించగా, ఎస్‌టి, ఎస్‌టిలకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తుందని చెప్పారు. గిరిజనులు బిల్లులు చెల్లించవద్దని తెలిపారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

విజయనగరం కోట : అభినయ, నాటకశాల, నటరత్న, నాటక పరిషత్ 9వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీలు వచ్చేనెల 6,7,8 తేదీల్లో జరుగుతాయనినాటక పరిషత్ అధ్యక్షులు అభినయ శ్రీనివాస్, కార్యదర్శి గద్ద వరప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి చేతుల మీదుగా శుక్రవారం విడుదల చేశారు. ఈ పోటీలను గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియం లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రోజుకు రెండు నాటికలు చొప్పున ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, కార్యదర్శి పాసి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన సభ్యులు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి ఎంపిపి, వైస్ ఎంపిపిపై టిడిపి పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్‌డిఒ రామ్మోహనరావు సమక్షంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బేబినాయన హాజరయ్యారు. మండలంలో 14 ఎంపిటిసి స్థానాలుండగా, గత ఎన్నికల్లో వైసిపి, టిడిపి చెరో ఏడు స్థానాల్లో విజయం సాధించాయి. దీంతో లాటరీ పద్ధతిలో ఎంపిపి పదవిని వైసిపి సొంతం చేసుకుంది. ఇటీవల కాలంలో ఇద్దరు ఎంపిటిసిలు టిడిపిలో చేరారు. దీంతో సమావేశానికి 9 మంది హాజరై, ఎంపిపి, వైస్ ఎంపిపిపై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు పిఒ ప్రకటించారు. ఈ సమావేశానికి వైసిపి మిగతా సభ్యులు ఎవరూ హాజరుకాలేదు.

నాడు అడ్డదారుల్లో పదవులు దక్కించుకుని.. : ఎమ్మెల్యే

గత స్థానిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అడ్డదారుల్లో పదవులు దక్కించుకుందని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ అధికారమదంతో ఆనాడు అధికారులను ఒత్తిడికి, ప్రలోభాలకు గురిచేసి పదవులు దక్కించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం న్యాయబద్ధంగా అవిశ్వాస తీర్మానంతో దక్కించుకోవడాన్ని జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే శంబంగి తమపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శంబంగి చేసిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, కూటమి సత్తా వైసిపి నాయకులకు స్థానిక ఎన్నికలలో తప్పక చూపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు, ఎంపిటిసి పాలవలస గౌరు పాల్గొన్నారు.

ప్రజల మద్దతుతో గెలవాలి

మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి : ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతుతో గెలవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు.. టిడిపి నాయకులకు హితవుపలికారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బాడంగి మండలంలో ప్రజల మద్దతుతో ఎంపిపి స్థానాన్ని వైసిపి కైవశం చేసుకుంటే, టిడిపి నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఎంపిటిసిలను ప్రలోభ పెట్టి దళిత ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం పెట్టారని విమర్శించారు. గతంలో బొబ్బిలి మున్సిపాలిటీలోనూ అవిశ్వాసం పెట్టారని చెప్పారు. ప్రలోభాలకు తలొగ్గి కొంతమంది ఫ్యాన్ గుర్తుపై గెలిచి వైసిపికి ద్రోహం చేశారని, వారిని క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ ఎంపిపి భోగి గౌరి మాట్లాడుతూ ప్రజల మద్దతుతో ఎంపిపి పదవి దక్కించుకుంటే అప్రజాస్వామ్య పద్ధతిలో తనకు అన్యాయం చేశారన్నారు. జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు మాట్లాడుతూ రాజులకు రాజకీయ విలువలు లేవని విమర్శించారు.



ఉద్యోగులతో కలిసి ఇఎస్ఐ కార్డులను ప్రదర్శిస్తున్న ఎడి శ్యామ్‌ప్రసాద్, ఇతర అధికారులు

ఇఎస్ఐలో నమోదుకు డిసెంబర్ వరకు అవకాశం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఇఎస్ఐలో ఇంతవరకు నమోదు కాని కార్మికులకు ఈ ఏడాది డిసెంబర్ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇఎస్ఐ కార్పొరేషన్ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం పలు పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఈఎస్ఐ లో నమోదు కాని లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు కార్మికులు ఉన్న సంస్థలు, కర్మాగారాలు తాము ఎంచుకున్న తేదీని ఇఎస్ఐ కవరేజ్ తేదీగా ప్రకటించి ఇఎస్ఐసి పోర్టల్ ,శార్మ్ సువిధ పోర్టల్ ఎంసిఎ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నట్లయితే ఆ తేదీ నుండి వారికి ఇఎస్ఐ వర్తిస్తుందన్నారు. అమ్ మినిస్ట్రీ స్కీమ్ 2025 ప్రకారం ఈ ఏడాది మార్చి 31 కంటే ముందు ఇఎస్ఐ ద్వారా లేదా కర్మాగారాలు సంస్థలు గాని కవరేజ్ నిమిత్తం లేదా పెనాల్టీలు నిమిత్తం ఒకరిపై ఒకరు కోర్టులో కేసులు నమోదు చేసుకొని ఇప్పటివరకు పెండింగ్‌లో ఉంటే ఇఎస్ఐ కార్యాలయంలో పరిష్కరించదానికి అవకాశం కల్పిస్తుందన్నారు .ఈ పథకం వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇఎస్ఐ సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఇఎస్ఐ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ జి.జీవ రత్నం, ఎపిటోరా కంపెనీ హెచ్‌అర్ హెడ్ పి.నారాయణ రావు, హెచ్‌ఆర్ మేనేజర్ సుందర్, ఎజిఎం హెచ్‌ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన బస్సు జాతా శుక్రవారం విజయనగరం చేరుకుంది. గురజాడ కళాక్షేత్రం వద్ద ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఈశ్వరయ్య మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.6800 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వలన విద్యార్థులు రోడ్డున పడ్డారని అన్నారు. గత వారంలో గిరిజన విద్యార్థులు అనారోగ్యం బారినపడి నలుగురు విద్యార్థులు మరణించినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఒక్క రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదని అన్నారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం ముసుగులో విద్యను పూర్తిస్థాయిలో కాషాయికరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పండుతుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేసి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలలు పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎవైయస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి, సహాయ కార్యదర్శి, షేక్ మస్తాన్ ప్రసంగించారు, బస్సుజాతకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము స్వాగతం పలుకుతూ మద్దతు పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు పి.కామేశ్వరరావు, బుగత అశోక్, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాదర్బార్‌లో 30 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు శుక్రవారం టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి 30వినతులు స్వీకరించారు.ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కొత్త పెన్షన్లు ఇవ్వాలని, భూ సమస్య పరిష్కరించాలని, రహదారులు వేయాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపైనా అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైవే నుంచి గొల్లల పేటకు వెళ్లే మార్గం అస్తవ్యస్తంగా ఉందని, రోడ్డు నిర్మించాలని ఈగల సత్తిబాబు ఆధ్వర్యంలో వినతి సమర్పించారు. సమతా మార్క్ రోడ్డు గత 30 ఏళ్ల క్రితం నిర్మించారని, దాన్ని బాగు చేయాలని వినతి నిచ్చారు. సారిక గ్రామానికి చెందిన మజ్జి మహేష్ కు ట్రై సైకిల్ ఇవ్వాలని సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు కోరారు. కొండకరకాంకు చెందిన వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానికి ఇంటిస్థలం కేటాయించినప్పటికీ కట్టుకోవడానికి స్తోమత లేదని, ఇంటి నిర్మాణానికి సహాయం అందించాలని మాజీ సర్పంచ్ పాండ్రంకి గౌరినాయుడు, మాజీ ఎంపిటిసి రాంబర్కి రాంబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షులు అనురాధ బేగం, పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, కార్యదర్శి పాశి అప్పలనాయుడు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదు లక్ష్మీ వరప్రసాద్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



ప్రసాదుల రామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదితి

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన నగరంలోని 31వ డివిజన్ నటరాజ్ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త పెద్ద నూకరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నూకరాజు కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన ప్రమాద భీమా రూ.5 లక్షలను వారి బ్యాంకు ఖాతాకు జమ అయిన సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన సందేశాన్ని వారికి అందజేశారు. ఇటీవల ఇంట్లో కాలుజారి పడిపోయి గాయపడిన మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం, శబరిమలకు ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా నుంచి పంచారామాలు, శ్రీశైలం, శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడుపుతోందని డిపిటిఒ జి.వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను పంచారామాలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయ్యప్ప భక్తుల కోసం విజయనగరం నుండి శబరిమలకు ఏడు రోజులు, 11రోజులు యాత్రలను ప్రత్యేక సర్వీసులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు, కార్తీక్ మాసం పిక్నిక్ స్పెషల్ బస్సులను కూడా నడుపుతున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు డిపో మేనేజర్ విజయనగరం 99592 25620, అసిస్టెంట్ మేనేజర్ 7382924103, సూపరింటెండెంట్ 7382921380, బుకింగ్ సూపర్‌వైజర్ 7382923683, ఎస్.కోట డిపో మేనేజర్ 9959225619, సిస్టం సూపర్వైజర్ 9440359596 గల నెంబర్లను సంప్రదించాలన్నారు కార్యక్రమంలో విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సిఐ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట : పంచారామాల దర్శనాలకు వెళ్లే యాత్రికుల కోసం శృంగవరపుకోట డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.సుదర్శన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్ట్రా డీలక్స్ (రూ.1950), సూపర్ లగ్జరీ (రూ.2వేలు) బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్యాకేజీ బస్సులు కావలసిన వారు సూపరింటెండెంట్ వెంకటరావు (7382923679)ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం తైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 42వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారులంతా జాతీయ స్థాయిలో రాణించి ఆంధ్ర రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురువేయాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సుంకర సతీష్, అసోసియేషన్ కమిటీ సభ్యులు కె.రాంబాబు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ తైక్వాండో పరిశీలకులు ఫరీద్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీని తిలకిస్తున్న ఎమ్మెల్యే

డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా నియమితులైన డి. వెంకటేశ్వర రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రామసుందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో క్రీడలు, స్టేడియంల పరిస్థితిని వివరించారు. వెంకటేశ్వర రావు గతంలో జిల్లాలో కబడ్డీ కోచ్‌గా, డిఎస్‌డిఒ గా సేవలు అందించారు. ఇటీవల విశాఖపట్నం బదిలీపై వెళ్లి, తిరిగి విజయనగరం జిల్లా డిఎస్‌డిఒగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, పలు క్రీడల కోచ్‌లు అభినందనలు తెలిపారు.


కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న డిఎస్‌డిఒ


నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు జగన్, నిర్వాసితులు

126వ రోజుకు జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను తమకు తిరిగి ఇవ్వాలని కోరుతూ జిందాల నిర్వాసితులు బొడ్డవరలో చేపడుతున్న నిరసన శుక్రవారం 126వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ నిర్వాసితులతో కలిసి నిరసన తెలిపారు.

పంట నమోదు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-గంట్యాడ

నిర్ణీత కాలంలోగా పంటల నమోదు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. శుక్రవారం మండలంలో ఇ-పంట నమోదును ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 1.54 లక్షల కమతాలు ఉన్నాయని, ఇంకా 35 వేల కమతాలను నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. సచివాలయ సిబ్బందికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణం, ఎఒ శ్యామ్‌కుమార్, ఎఇఒ హైమావతి, సునీల్‌కుమార్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భారతి

వాగ్దేవి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కొత్తవలస

సత్యసాయి సేవా సమితి నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో వాగ్దేవి విద్యార్థి బోగాది బాలశ్రీ ప్రథమ స్థానం సాధించింది. దీంతో బాలశ్రీని కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్స్ సురేష్, సతీష్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ అభినందించారు.

డిఎపై కూటమి ప్రభుత్వ మోసం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ చెల్లింపుపై టిడిపి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ ఉద్యోగులకు ఒక డిఎ కూడా ఇవ్వలేదని కూటమి నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

ఆధార్ సేవలు వేగవంతం

ప్రజాశక్తి-భోగాపురం

మండల పరిధిలో ఆధార్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ స్వరూపారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని పోలిపల్లి, భోగాపురం ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపులను ఆమె పరిశీలించారు. ఆధార్ కేంద్రాలలో విద్యుత్ అంతరాయం కారణంగా సేవలు మందగించాయని, దీనిపై ఇప్పటికే ఎలక్ట్రికల్ అధికారులతో మాట్లాడామని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన 4 ఆధార్ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 65 మందికి సేవలందినట్లు చెప్పారు.

బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.బూర్జవలస ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. మండలంలోని ఎస్.బూర్జవలస పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం పాటలు నిర్వహించినా, మద్యం విక్రయిస్తూ పట్టుబడినా కేసులు నమోదు చేస్తామన్నారు.

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహారాణి పేటలోగల విజ్ఞాన భారతి స్కూలు, ఆర్‌ఎస్ అకాడమీలో విద్యార్థులకు శక్తియాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గంజాయి, సైబర్ నేరాలపై మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఇ.నరసింహ మూర్తి, ఎస్‌ఐ శిరీష శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులకు శక్తి యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల అనర్థాల గురించి వివరించారు. మహిళల రక్షణకు, భద్రతకు శక్తి ఎస్‌ఒఎస్ యాప్‌ను ఏవిధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏదైనా అసాంఘిక కార్యక్రమాలయొక్క సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100/112కు లేదా దగ్గరలో ఉండే పోలీస్ స్టేషనుకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి బృందం సిబ్బంది, స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ


ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన ఎస్‌సి యువత కు 45 రోజుల పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు 15 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. శుక్రవారం కలెరేట్ నుంచి బయలు దేరిన శిక్షణ బస్సుకు సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ జెండా ఊపి ప్రారంభించారు. వీరికి విటి అగ్రహారంలో గల ఆర్‌టిసి శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు జెసి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డి.వెంకటేశ్వర రావు, ఆర్‌టిసి డిపిటిఒ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజులగుమ్మడ ఆశా కార్యకర్త మృతి

ప్రజాశక్తి -వంగర

మండలంలోని పెద్ద రాజులగుమ్మడ ఆశా కార్యకర్త పాలక జయమ్మ (40)శుక్రవారం మృతి చెందింది. జయమ్మ ఓ డెలివరీ కేసుకు సంబంధించి ఈనెల 23 గురువారం రాత్రి వరకు అదే పనిలో ఉన్నారు. శుక్రవారం తన ఆరోగ్యం బాగోలేదంటూ వంగర ఆరోగ్య కేంద్రం వైద్య అధికారికి తెలియజేసి తన కుటుంబ సభ్యులతో పార్వతీపురం వెళ్లింది. పార్వతీపురం చేరుకునేసరికి జయమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గుండె పోటుతో మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జయమ్మకు భర్త రవి, కుమార్తెలు జ్యోత్స్న వి, పరిమిళ ఉన్నారు.



గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరంలోని ఉడాకాలనీ ఫేజ్ 3 లో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొయిద రామకృష్ణ (31)శుక్రవారం మృతి చెందాడు. తోటపాలెంకు చెందిన రామకృష్ణ ఈనెల 17న ఉడా కాలనీ ఫేజ్ 3లో ద్వి చక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడని వన్‌టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి తెలిపారు బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు.

ఒప్పంగిలో ట్రాక్టర్ల సామగ్రి చోరీ

రేగిడి : మండలంలోని ఒప్పంగి గ్రామంలో శుక్రవారం రాత్రి దాకిటి శంకర్రావు కళ్లంలో ట్రాక్టర్ బ్యాటరీ, వాహన సామగ్రి చోరీకి గురయ్యాయి. రెండు రోజుల క్రితం కడగల త్రినాథరావు కళ్లంలో ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. శంకర్రావు, త్రినాథరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

చంద్రబాబు పాలనంతా ప్రయివేటుపరమే

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న పాలన అంతా ప్రయివేటు పరమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. చీపురుపల్లిలోని వైసిపి కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ప్రధాన నాయకులతో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రకు నిరసనగా ఈ నెల 28న గరివిడి శంకర్ ఫంక్షన్ హాల్ నుండి చీపురుపల్లి తహశీల్దారు కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతీదీ ప్రయివేటుపరం చేస్తోందని దుయ్యబట్టారు. విదేశాలకు వెళ్లి స్టార్ హోటళ్లలో కూర్చొని పరిశ్రమలు తీసుకొస్తున్నామని డబ్బా కొట్టుకోవడమే తప్ప వేరే ఉపయోగమేమీ లేదని ధ్వజమెత్తారు. అనంతరం ప్రజా ఉద్యమం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా సీనియర్ నాయకులు మరిశర్ల బాపూజీనాయుడు, కెవి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వైసిపి నాయకులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ కోరుతూ స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వైసిపి ఆధ్వర్యాన శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి డిప్యూటీ మేయర్ శ్రావణి, జిల్లా యువజన మరియు విద్యార్థి విభాగాల ఇన్చార్జ్ కౌశిక్ ఈశ్వర్ పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, సీనియర్ కార్పొరేటర్ రాజేష్, సంగంరెడ్డి పాల్గొన్నారు.




చీపురుపల్లి.. ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు మజ్జి, బెల్లాన, తదితరులు ; గజపతినగరం.. రంగుపురంలో సంతకాలు సేకరిస్తున్న జెడ్‌పిటిసి, సర్పంచ్

బొబ్బిలి : ఈ నెల 28న వైసిపి చేపట్టనున్న ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెడికల్ విద్య, పేదలకు ఉచిత వైద్యం అందకుండా చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలస : ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రంలో చేపట్టే ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. కొత్తవలసలోని తన క్యాంపు కార్యాలయంలో వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో ఈ నెల 28న పెద్ద ఎత్తున నిరసన చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేసే అనాలోచిత నిర్ణయాన్ని ప్రభుత్వ మెడలు వంచి వెనక్కి తీసుకునేలా చేస్తామని తెలిపారు. అనంతరం ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రంగుపురంలో సంతకాల సేకరణ

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రంగుపురం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ కర్రి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి గార తవుడు ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా లక్కవరపుకోట మండలంలో కొట్యాడ, తలారి, కాసాపేట, దాసులపాలెం గ్రామాల్లో వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు గేదెల శ్రీనివాసరావు సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో చందలూరు ఎంపిటిసి ఎడ్ల కిశోర్‌కుమార్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కొట్యాడ శ్రీనివాసరావు, కొట్యాడ మహేష్, ముమ్మిన ప్రసాద్, కోళ్ల కృష్ణ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను తరిమేసిన చరిత్ర జగన్‌ది

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టకుండా పారిశ్రామిక వేత్తలను భయపెట్టి రాష్ట్రం నుండి తరిమివేసిన చరిత్ర మాజీ సిఎం జగన్‌దేనని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డేటా సెంటర్ తీసుకువచ్చిన ఘనత జగన్‌దే అంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నకిలీ మద్యంపైనా, సంక్షేమంపైనా జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి హయాంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా రాజ్యమేలిందని చెప్పారు. ఉద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం : టిడిపి

స్వార్థ రాజకీయాల కోసం మెడికల్ కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వంపై వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను కప్పి పుచ్చుకొనేందుకే వైసిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అబద్దాలు చెప్పి వారిని పక్కదోవ పట్టించుకునేందుకే కోటి సంతకాల నాటకమని చెప్పారు. పిపిపి విధానంలో ప్రభుత్వ కోటాలో వైద్య సీట్లు అదనంగా పెరుగుతాయన్నారు. వైసిపి ఎన్ని అబద్దాలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు.

పోలియోపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -విజయనగరం కోట

ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోటరీ క్లబ్ ల ఆధ్వర్యంలో నగరంలో పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విజయనగరం రోటరీ మెయిన్ క్లబ్, సెంట్రల్ రోటరేక్ట్, ఇంటరేక్ట్, ఇన్నర్ వీల్ క్లబ్ ల ప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణంలోని ఎన్‌సిఎస్ థియేటర్ వద్దనున్న గాంధీ విగ్రహం మంచి ప్రారంభమై మయూరి జంక్షన్ వరకు సాగింది.రీజనల్ పోలియో చైర్మన్ టిఎల్‌ఎన్ మూర్తి నిర్వహణలో జరిగిన ఈ ర్యాలీని రోటరీ పూర్వపు గవర్నర్‌లు ఎం.రామారావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ర్యాలీలో రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాసరావు, సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, ఫోర్ట్ క్లబ్ అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి లక్ష్మీ నారాయణ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.మంజు, కార్యదర్శి కృష్ణవేణి, పోలియో చైర్ ఎ.శ్రీనివాసరావుతో పాటు రోటరీ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

పోలియో రహిత ప్రపంచమే రోటరీ లక్ష్యం

బొబ్బిలి : 40 సంవత్సరాలుగా పోలియో రహిత ప్రపంచమే లక్ష్యంగా రోటరీ క్లబ్ కృషి చేస్తోందని క్లబ్ జిల్లా అధ్యక్షులు జెసి రాజు తెలిపారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా క్లబ్ అధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి శివ కాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటిఐ కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది, డిటిఒలు రాములప్పడు, హరికృష్ణ పాల్గొన్నారు.

పిఎసిఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాజాం

రాజాం పిఎసిఎస్ అధ్యక్షులుగా వంగా గోవిందరావు, సభ్యులుగా నాగళ్ల అప్పలనాయుడు, సామంతుల గౌరినాయుడు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పిఎసిఎస్ ద్వారా రూ.34.09 లక్షల చెక్కును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నంది సూర్య ప్రకాశరావు, సుమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, వంగా వెంకటరావు, టంకాల కన్నంనాయుడు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, వల్లూరి గణేష్, సత్యనారాయణ, రఘుమండల గణపతి, జయరాం, మరిపి జగన్‌మోహన్ రావు, బవిరి శ్రీనుబాబు, జనసేన నాయకులు యుపి రాజు, గెడ్డపు నీలకంఠం, చిితిరి నాగరాజు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, నాయకులు

హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ పాయింట్‌ను శుక్రవారం ప్రారంభించారు. డ్వాక్రా మహిళ కర్రి చిన్నారికి నెల్లిమర్ల గాయత్రి ఏజెన్సీకి చెందిన బూర్లే శ్రీధర్ ఈ ఏజెన్సీని అందజేశారు. మహిళలను ఉపాధిలో ప్రోత్సహించడం కోసం ఈ గ్రామంలో ఈ పాయింట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిరికి అప్పారావు, టిడిపి నాయకులు సిరికి మహేష్, కనక రమణ, సత్తిబాబు, బిజెపి నాయకులు కర్రి కృష్ణ పాల్గొన్నారు.

పోలీసులందరికీ హెల్త్ చెకప్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగులు, హోంగార్డుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వలన వారిలో ఆరోగ్య సమస్యలను గుర్తించక అర్ధంతరంగా అస్వస్థతతకు గురికావడం, మతి చెందడం జరుగుతోందన్నారు. ఈ తరహా సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న అందరికీఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న 1193 మంది పోలీసు సిబ్బందికి స్కాన్యులో వైద్య పరీక్షలు నిర్వహించామని, అందుకు సంబంధించి రూ.8.95 లక్షలను చెక్ రూపంలో స్కాన్యూ మేనేజిమెంటుకు చెల్లించినట్లు ఎస్‌పి తెలిపారు.

మద్యం నాణ్యతపై సురక్ష యాప్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో గల మద్యం షాపులు, బార్ల వద్ద మద్యం నాణ్యత తెలుసుకోవడానికి ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్లను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పలుచోట్ల అతికించారు. వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షించుకోవచ్చునని అవగాహన కల్పించారు. విజయనగరంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బమ్మిడి శ్రీనాథుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక వన్ టౌన్ సిఐ కె.మన్మథరావు పాల్గొన్నారు.

10 మందిపై బైండోవర్

ప్రజాశక్తి - గజపతినగరం

మండలానికి చెందిన పది మందిపై శుక్రవారం బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ జనార్దనరావు తెలిపారు. గతంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన పదిమందిని శుక్రవారం తహశీల్దార్ రత్నకుమార్ వద్ద హాజరుపరచగా, బైండోవర్ కేసులు నమోదు చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలో 16 మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లను అతికించారు. ఎంఆర్‌పి కంటే అధిక వసూళ్లకు పాల్పడినా, నాటు సారా ఆనవాళ్లు ఉన్నా 9440902367 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సిఐ కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్

ప్రజాశక్తి-డెంకాడ

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పినతాడివాడ పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. రిసెప్షన్, ఎస్‌హెచ్‌ఒ గది, విహెచ్‌ఎఫ్ సెట్, లాకప్స్, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, అడ్మినిస్ట్రేషన్ గురించి ఎస్‌ఐ అవగాహన కల్పించారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

'లెండి'లో ఫ్రెషర్స్ డే వేడుక

ప్రజాశక్తి-డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథులు టెక్ మహీంద్రా హెడ్ ఆఫ్ టాలెంట్ డెవలప్‌మెంట్ చల్లా వివేకానంద, సిస్కో సీనియర్ సెక్యూరిటీ డైరెక్టర్ వెంకటేష్, ఫ్లూమ్ డిజైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ బైరి తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం అతిథులను కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు పి.రాజీవ్ సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, వి.అంజిరెడ్డి, కెవి నరసింహం, సీనియర్ నిర్వాహకులు జి.ప్రకాశ్ బాబు, డాక్టర్ బి.వి.ఎస్.ఆచార్యులు, కె.వై.వసంత్ పాల్గొన్నారు.

లిక్కర్‌స్కామ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి

వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టి ంచేందుకు కల్తీ మద్యం.. అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ఆరోపించారు. మండలంలోని డొంకినవలస జంక్షన్‌లో ఉన్న వైన్‌షాపును శుక్రవారం వారు తనిఖీ చేశారు. కల్తీ మద్యం అమ్మితే కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. కల్తీ మద్యం నివారణకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్ తీసుకొచ్చిందన్నారు. ఎప్పుడైనా, ఎవరైనా వైసిపి నాయకులు షాప్‌లోకి వెళ్లి తనిఖీ చేసుకోవచ్చని సూచించారు.


మద్యం సీసాను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

మెనూ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి-మెంటాడ

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే మెనూ, డైట్ ఛార్జీలు పెంచాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్ర ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. అన్నం, సాంబారు, గుడ్లు మెనూ ప్రకారం అందిస్తున్నారని, పాఠశాలలో జ్వరాలు లేవని, మెనూ ఛార్జీలు పెంచాలని విద్యార్థులు కోరారు. మెంటాడ పిహెచ్ వైద్యులు, ఆశా కార్యకర్తలు రోజూ పాఠశాలకు వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఇటీవల జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. మంత్రి హోదాలో బాధ్యతారాహిత్యంగా మాట్లాడవద్దని, వసతిగృహాల్లో, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కిందట నిర్మాణం చేపట్టిన అదనపు భవనం అసంపూర్తిగా ఉందని, వెంటనే నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చెవ్వూరి కృష్ణవేణి పాల్గొన్నారు.


మెనూ అమలును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విస్తృతంగా ఆయుర్వేద వైద్య సేవలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఆయుర్వేద వైద్య సేవలు విస్తృతంగా అందుతున్నాయి. ఆయుర్వేద ఆస్పత్రికి గత కొంత కాలంగా వైద్యులను నియమించక పోవడంతో మూత పడింది. ఇటీవల ఆయుర్వేద వైద్యులు పి.గంగాసింధు నియమితులయ్యారు. దీంతో ఆయుర్వేద ఆస్పత్రి మళ్లీ కళకళలాడుతోంది. వైద్య సేవల కోసం రోగులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.


డాక్టర్ గంగా సింధు

ఫోర్ట్ సిటీ స్కూల్‌కు ఎడ్యు ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగంలో విశేష కృషి చేస్తునందుకు ఫోర్ట్ సిటీ స్కూల్‌కు మల్లా బ్యూరో ఆఫ్ చిల్డ్రన్ డెవలప్మెంట్ వారు అందించే ఎడ్యు ఐకాన్ 2025 అవార్డు లభించింది. గురు వారం విశాఖపట్నంలోని ప్రైవేటుహోటల్‌లో విశాఖపట్నం ఎంపి భరత్ చేతుల మీదుగా డైరెక్టర్ మధు ఈ అవార్డును అందుకున్నారు. విద్యా విధానం మార్పులకు అనుగుణంగా పాఠశాల యాజమాన్యం ఎప్పుడూ విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుతూ ఉంటుందని చైర్మన్ కెపి రాజు అన్నారు. అవార్డు రావడం పట్ల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోయాన ఖాన్, డైరెక్టర్లు అశోక్, నీలిమా అభినందనలు తెలియచేసారు.


అవార్డు అందుకుంటున్న ఫోర్ట్ సిటీ స్కూల్ డైరెక్టర్ మధు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-డెంకాడ

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒలు కె.వి రమణ, కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. వీరు ఈ నెల 29న నియోజకవర్గ స్థాయిలో పోటీలకు హాజరుకావాలని ఎంఇఒలు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

రేగిడి : రేగిడి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఎంఇఒలు ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు వి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు వి.సతీష్ మల్లేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, లోకేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

మెరకముడిదాం : రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎంఆర్‌సిలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలలు నియోజకవర్గస్థాయి పోటీలకు హాజరవుతారని ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ-2 జ్ఞానశంకర్ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలకు హెచ్‌ఎంలు సిహెచ్ ఆనంద మూర్తి, పతివాడ త్రినాథ్, తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటిలు ఎం.రేవతి, ఎం.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

వేపాడ : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు ఎన్.నాగభూషణ రావు, పి.బాల భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.వల్లి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.



రేగిడి, మెరకముడిదాంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఎంఇఒలు